మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# కార్పొరేషన్ 'క్యాంప్'



- ఫలితాల రోజు రాత్రి చీరాలకు తరలిన మహబూబ్‌నగర్ కార్పొరేటర్లు?
- నిన్న ముఖ్య నేతలతో కలిసి బయలుదేరిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- నలుగురు రెబెల్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరికతో 34కు చేరిన సంఖ్య
- రేపే మేయర్ చైర్మన్‌ల ఎన్నిక




**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ కార్పొరేషన్ ఎన్నిక ఉత్కంఠకు మరో 24గంటల్లో తిరపడనున్నది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 60 డివిజ న్లో కాంగ్రెస్ 30డివిజన్లో విజయం సాధించగా రెబెల్ అభ్య ర్థులు నలుగురు ఫలితాల అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని కలవడంతో వారి సంఖ్య 34కు చేరినట్లు తెలుస్తున్నది. గెలిచిన కార్పొరేట్ అభ్యర్థులతో సహా ముఖ్య నాయకులతో కలిసి కాంగ్రెస్ టీం క్యాంపునకు తరలినట్లు తెలుస్తుంది. రేపు మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో క్యాంపు నుంచి నేరుగా ఎన్నికరానికే రానున్నట్లు సమాచారం.

**ఒక్క ఓటుతో గెలుపు..**

పాలమూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాకా మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఫలితాల ప్రక్రియ కొనసాగింది. 53వ డివిజన్‌లో ఒక్క ఓటు మెజారిటీతో అభ్యర్థి గెలవడంతో రెండుసార్లు రీకౌంటింగ్ చేయాల్సి వచ్చింది. తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి రాఘవేంద్ర కు 818 ఓట్లు రాగా బిజెపి అభ్యర్థి రమేష్ కుమార్ కు 819 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు రమేష్ కుమార్ ను విజేతగా ప్రకటించారు. బిజెపి కార్పొరేటర్ల సంఖ్య ఏడుకు చేరింది.

**16కు చేరిన టిఆర్ఎస్ బలం..**

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యంత ప్రభావం చేసిందని చెప్పవచ్చు. మూడు నాలుగు స్థానాల్లో సమీప అభ్యర్థులుగా ఓడిపోయిన మొత్తానికి 15 స్థానాల్లో విజయం సాధించగా ఏడో వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచిన కురువ మంజుల మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరడంతో బిఆర్ఎస్ బలం 16కు చేరింది.

**ఫలించిన ఎమ్మెల్యే యెన్నం మంత్రాంగం..?**

నూతన కార్పొరేషన్ గా ఏర్పడ్డ మహబూబ్‌నగర్ పై కాంగ్రెస్ జెండా రెపరెపలాడనున్నది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మార్కు పాలనను స్వాగతించిన ప్రజలు 60 డివిజన్ల కు గాను 30 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. కాంగ్రెస్ పార్టీ రాదు.. గెలవదు 20 సీట్లకు మించి రావు అని టౌన్ లో ఒక వర్గం ప్రచారం చేసిన యెన్నం పాలనను ఆయన నిజాయితీని, విద్యా వ్యవస్థ పై ఆయనకు ఉన్న శ్రద్ధను గుర్తించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. అభ్యర్థుల ఎంపికలో కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని సద్దుమనిగేలా చేసి అందరూ నాయకులను సమన్వయం చేసి 30 మంది కార్పొరేటర్లు గెలవడంలో యెన్నం మంత్రం ఫలించిందని చెప్పవచ్చు. రెండు వర్గాలు మూడు వర్గాలు అంటూ ఇటు పార్టీపై అటు ఎమ్మెల్యే పై అవకాశము న్నప్పుడల్లా విమర్శనాస్త్రాలు చేసిన నాయకుల నోర్లు నేడు మూతపడనున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా మహబూబ్‌నగర్ మేయర్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడంలో ఎమ్మెల్యే యెన్నం వ్యూహం కీలకంగా పనిచేసిందని చెప్పవచ్చు.

### చైర్మన్ ఎన్నికల దిశగా

# కౌన్సిలర్ల తరలింపు

## చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలపై ఉత్కంఠ

**మద్దూరు,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల దిశగా రాజకీయ కదలికలు వేగం పుంజుకున్నాయి. ఫలితాల అనంతరం ప్రధాన రాజకీయ పార్టీలు తమ తమ కౌన్సిలర్లను ప్రత్యేక శిబిరాలకు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. మున్సిపాలిటీలో స్పష్టమైన మెజార్టీ సాధించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 9మంది కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో కలిపి మొత్తం 10 మంది ప్రత్యేక శిబిరాలకు వెళ్లినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పార్టీ కీలక నేతల సమక్షంలో సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వ్యూహంపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.ఏకాభిప్రాయం ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయాలనే దిశగా చర్చలు జరిగినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన 6 మంది కౌన్సిలర్లు మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కలసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మార్గదర్శకాలు పొందినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ముందుకు సాగాలని సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం ఉన్నప్పటికీ, చైర్మన్ పదవిపై ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గడ్డమీద గోవిందు, జీడి మౌనిక, ఢిల్లీకర్ సరస్వతి తదితరులు చైర్మన్ పదవిపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే తుది మాటగా భావిస్తూ ఆశావాహులు వేచి చూస్తున్నారు.




మద్దూరు మున్సిపల్ కార్యాలయం

# శివాలయాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు
- జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి
- జిల్లా ఎస్పీ జానకి శివరాత్రి శుభాకాంక్షలు

**మహబూబ్‌నగర్ క్రైమ్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఆదివారం జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన శివాలయాలకు భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర భద్రతా ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రముఖ శివాలయాలైన కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయం, మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం పరిసర శివాలయం, మహబూబ్‌నగర్ టౌన్‌లోని వీరన్నపేట పెద్ద శివాలయం, పిల్లలమర్రి సమీపంలోని శివాలయం తదితర ప్రాంతాలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే విధంగా జిల్లాలోని ఇతర ముఖ్య మండల కేంద్రాలలో కూడా భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ, అత్యవసర సేవలు, ప్రజల భద్రత కోసం తగిన పోలీసు సిబ్బందిని నియమించామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు ప్రశాంతంగా, భద్రతగా దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రజలకు విధుల్లో పాల్గొంటున్న పోలీస్ సిబ్బందికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పర్వదినం శాంతి, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించాలని ఆకాంక్షించారు.




జిల్లా ఎస్పీ జానకి

# బిఆర్ఎస్‌కు బిగ్ షాక్...

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కౌన్సిలర్



కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కౌన్సిలర్ యుగంధర్‌రెడ్డి

**దేవరకద్ర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన బిఆర్ఎస్ కౌన్సిలర్ యుగంధర్ రెడ్డి బిఆర్ఎస్ ను వీడారు. దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన బిఆర్ఎస్ కౌన్సిలర్ యుగంధర్ రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ నుండి ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున వలసలు జోరందుకున్న విషయం విధితమే.బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో కలవడంతో బిఆర్ఎస్‌కు కష్టకాలమని చెప్పవచ్చు. అనంతరం యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొండ శ్రీనివాస్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రం మరో గ్రీన్ సిగ్నల్..

- గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ నాలుగు లేన్ల రహదారికి ఆమోదం
- రూ. 3,175 కోట్ల నిధులు మంజూరు
- రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాలమూరు ప్రజానీకం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పాలమూరు అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం మరోసారి చిత్తశుద్ధి చాటుకున్నది. గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ నాలుగు లేన్ల రహదారికి ఆమోదం తెలిపింది. ప్రాజెక్టును రెండు ఏళ్లలోపు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన నిధులను కూడా మంజూరు చేయడంతో పాలమూరు ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నది.

**మంత్రివర్గంలో నిర్ణయం..**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో గూడెబెల్లూర్ నుండి మహబూబ్ నగర్ జాతీయ రహదారి 167ను 4లేన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఇందుకుగాను రూ.3,175 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి,కేంద్ర ప్రభుత్వానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల తరుపున ఎంపీ డీకే అరుణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**తగ్గనున్న దూర, వ్యయ బారం..**

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలకు దూరంతో పాటు వ్యయ భారం కూడా తగ్గనున్నది. నేషనల్ హైవే 167 ని 4లైన్లు 80.01 కిలోమీటర్ల విస్తరణ చేపట్టడం ద్వారా రవాణా సదుపాయం మరింత సులభతరం కానుందన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపి.. 3,175 కోట్ల నిధులు మంజూరు చేయడంతో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. ఈ ప్రాజెక్ట్ నారాయణపేట, మహబూబ్‌నగర్, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల అభివృద్ధికి దోహదపడుతుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతోపాటు హైదరాబాద్ పనాజీ మధ్య ఆర్థిక కారిడార్ ఎంతగానో ఉపయోగపడుతునున్నది. గూడెబెల్లూర్ నుండి మహబూబ్ నగర్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 50 శాతం తగ్గనుంది. ప్రస్తుతం 3 గంటల సమయం పడుతుండగా ఈ ప్రాజెక్టు పూర్తయితే గంటన్నరలో వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రాంతీయ కనెక్టివిటీని మరింత మెరుగుపరచడం ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎంపీ డీకే అరుణ హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాలుగా అభివృద్ధికి నోచుకోని రెండు జిల్లాల అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడనున్నది. కేవలం రెండేళ్లలో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయడం మరొక విశేషంగా చెప్పవచ్చు.

**బిజెపితోనే అభివృద్ధి..**



రాష్ట్రాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం అవుతుంది. తెలంగాణలో కూడా కేంద్ర ప్రభుత్వం నిధులతో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ప్రారంభించడం జరిగింది. పాలమూరుకు కేంద్రీయ విద్యాలయం తో పాటు, జాతీయ రహదారులు అండర్ పాసులు, ఆర్‌యుబీలు,ఆర్‌ఓబిలు, కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్లు, పియుకు 100 కోట్ల నిధులు, త్రిబుల్ ఐటీ ని కూడా మంజూరు చేయడం జరిగింది. తాజాగా గుడేబల్లూరు మహబూబ్‌నగర్ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా ప్రతిపాదించడమే కాదు నిధులు కూడా మంజూరు కావడం హర్షనీయం. కేంద్ర ప్రభుత్వానికి మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు. నేడు రాష్ట్రంలో అమలు చేస్తున్న అనేక పథకాలు కేంద్ర ప్రభుత్వ నిధులే. రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటున్నది. విషయాన్ని గుర్తించిన ప్రజలు బిజెపికి మద్దతుగా నిలుస్తున్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఏర్పడేది బిజెపి ప్రభుత్వమే..

*డీకే అరుణ, మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు*

### అన్ని పార్టీలు ఏకమైన

# 16 స్థానాల్లో గెలిచాం

- మేము అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు 5 సీట్లు రాలే..
- మేము 30 నుండి 40శాతం సీట్లు సాధించాం
- మీడియాతో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్
- బిఆర్ఎస్ కార్పొరేటర్లకు సన్మానం



బిఆర్ఎస్ కార్పోరేటర్‌లను సన్మానించిన మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ ని ఎదురుకోవడానికి అన్నీ పార్టీ లు ఏకమై ప్రయత్నం చేసాయని, అధికార పార్టీ భయభ్రాంతులకు గురిచేసిందని, కొందరు పోలీస్ అధికారులను వినియోగించుకొని బయపెట్టించినా తాము 16 సీట్లు గెలుచుకున్నామని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భూత్పూర్ రోడ్డు లోని మాజీ మంత్రి క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కార్పోరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి జిల్లాలో 5 శాతం కాంగ్రెస్ కి సీట్లు లేవని, కానీ మేము 30 నుంచి 40 శాతం సీట్లు గెలుచుకున్నామని, ఓడిపోయిన కూడా 50 ఓట్లలోపు 5 సీట్లు కోల్పోయామని తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ మద్యం.. డబ్బు.. అధికారం విని యోగించినా 16 సీట్లు మేము గెలిచామని పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న పెండింగ్ పనులు ట్యాంక్ బండ్, వెయ్యి పడకల అస్పత్రి, గురుకులాల భవన నిర్మాణం పనులు, హజ్ హౌస్.. క్రిస్టియన్ భవన్ పనులు ఇలా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. వార్డులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, ఎన్నికల సంఘము పిర్యాదులు చేసిన పట్టించుకోలేదని, డబ్బుల సంచులు నియోజకవర్గలకు పోతున్న పోలీస్ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం పై వ్యతిరేకత ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందన్నారు. బీసీ రిజర్వేషన్ సమస్య పరిష్కరించి జడ్పీటీసీ.. ఎంపీపీ ఎన్నికలు నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశాడు. జాబ్ క్యాలెండరు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసారని, ఉద్యోగులకు 5డి లు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని, విశ్రాంత ఉద్యోగస్తులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వడం లేదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ లో గెలిచిన 15 మంది కార్పొరేటర్లతో పాటు, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఏడవ డివిజన్ అభ్యర్థి కురువ మంజుల మాజీ మంత్రిని కలిశారు.



ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

# కల్వర్టును ఢీకొన్న క్రూయిజర్...

- భార్యాభర్తలతో సహా ముగ్గురు మృతి...
- ఏడుగురికి తీవ్రగాయాలు

**ఊర్కొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** డ్రైవర్ అజాగ్రత, నిద్రమత్తు, అతివేగం కారణంగా చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కర్ణాటక భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఘటన ఊర్కొండ మండల పరిధిలోని తిమ్మన్నపల్లి సమీపంలో శనివారం తెల్లవారుజామున జడ్చర్ల-కోదాడ ప్రధాన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం,విజయపురి (బీజాపూర్) జిల్లా, తాళికోట ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది భక్తులు రెండు క్రూయిజర్ వాహనాల్లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనం కోసం శుక్రవారం రాత్రి బయలుదేరారు. తిమ్మన్నపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కెఏ28ఎన్8746 నెంబరు గల క్రూయిజర్ వాహన డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా కల్వర్ట్‌ను బలంగా ఢీకొట్టడంతో రాంరెడ్డి దేశాయ్ (50), మేఘ దేశాయ్ (45), మహాదేవి (65) అక్కడికక్కడే మృతి చెందగా బసన్నగౌడ, మల్లమ్మ, శివమన్యం, రాములుగౌడ, నీలమ్మ, బసప్ప, రాము (డ్రైవర్)కు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. గాయపడిన వారిని మెరుగైన వైద్య సేవల కోసం యెన్నం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

**పోలీసుల సేవలు భేష్...**

రోడ్డు ప్రమాదం జరిగిందనే విషయాన్ని తెలుసుకున్న కల్వకుర్తి సిఐ నాగార్జున సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకొని జేసిబి సహాయంతో మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీశారు. ప్రమాద ఘటనలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టిన చర్యలకు మండల ప్రజలు, ప్రయాణికులు సిఐ నాగార్జున, ఎస్‌ఐ కృష్ణదేవ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

### దేశ రక్షణ కోసం ఆత్మత్యాగానికి

# సిద్ధంగా ఉండాలి

పుల్వామా ఉగ్ర దాడిలో అమరులకు కొవ్వొత్తులతో ఘన నివాళి



అమరులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## జిఎంఆర్ నిబద్ధతకే పట్టం కట్టిన ఓటర్లు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలో జరిగిన భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర, మున్సిపాలిటీ ఎన్నికల్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి వ్యూహం ఫలించింది.దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, ఇతర మంత్రులతో ఉన్న సన్నిహిత్యంతో దేవరకద్ర నియోజకవర్గానికి నిధుల వరద పారుతుంది. కేవలం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఆయన రాత్రి పగలు తేడా లేకుండా గత రెండేళ్లుగా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజల కష్టసుఖాలు పాలుపంచుకుంటూ ప్రాంతా అభివృద్ధికి భారీగా నిధులు తీసుకురావాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. ఆశించిన విధంగానే నిధులు తీసుకురావడంలో ఆయన సఫలమయ్యారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు దేవరకద్ర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి పట్టం కట్టి, ఈ తీర్పు ద్వారా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి, సంపూర్ణ ఆమోదం తెలిపారు.

## ప్రతివారం మార్నింగ్ వాక్ నిర్వహిస్తా

**మార్నింగ్ వాక్‌తో వార్డులోని సమస్యలను తెలుసుకుంటున్న సర్పంచ్ శ్వేత శివకుమార్**

**ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా**



మార్నింగ్ వాక్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సర్పంచ్

**దామరగిద్ద, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం పరిధిలోని మల్‌రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం 1వ వార్డులో గ్రామ సర్పంచ్ శ్వేత శివకుమార్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.మండలంలో ఎవరూ చేయని విధంగా ప్రతివారం మార్నింగ్ వాక్ చేపట్టడం ద్వారా గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని గ్రామస్తులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రజలు డ్రైనేజీ సమస్య, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంగన్‌వాడీ భవనం నిర్మాణం, కరెంట్ స్తంభాల సమస్య తదితర అంశాలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలను ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తానని శ్వేత శివకుమార్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు లేని అర్హులకు ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కారం చూపిస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్, ఉపసర్పంచ్ లాలప్ప, వార్డు సభ్యుడు రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్వ గోపాల్, కాలనీ వాసులు కోతి శ్రీను, వెంకటప్ప, బీంషప్ప, ఆశా వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు మేమున్నాం

**సంజీవ్ కుటుంబానికి మిత్రుల భరోసా, ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయం**



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**మాగనూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా, మాగనూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్ సంజీవ్ కుమార్ గత సంవత్సరం డిసెంబర్ 27న యాక్సిడెంట్‌లో చనిపోయాడు. సంజీవ్ లేకపోయినా ఆపద సమయంలో మీ కుటుంబానికి మేమున్నామంటూ 2001,2002 సంజీవ్ టెన్త్ బ్యాచ్ మిత్రులు ఆయన భార్యకు భరోసా ఇచ్చారు. శనివారం సంజీవ్ ఇంటికి వెళ్లి భార్య పిల్లల యోగక్షేమాలు తెలుసుకున్నారు.మిత్రుల తరఫున ఆయన భార్యకు లక్ష రూపాయలు ఆర్థికసాయం చేశారు.పిల్లల చదువులతో పాటు ఏ సమస్యలు వచ్చినా మిత్రులను సంప్రదించాలని కోరారు. మిత్రుడు ఇక లేడని గుర్తు చేసుకొని మిత్రులు కన్నీళ్లు పెట్టుకున్నారు. గ్రామ సర్పంచ్ తనయుడు బాబు, మిత్రులు వెంకటేష్ గౌడ్, జి.రాకేష్ రెడ్డి, సగరం వెంకటేష్, పి.బాబు, కె.లక్ష్మీనారాయణ, ఎస్.బస్వరాజ్, విష్ణు,పి.భరత్ లు ఉన్నారు.

## జ్ఞాన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం

**ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ**

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పేతుబద్ధతను పెంపొందించడంలో వారి కృషి అభినందనీయమని టిపిసిసి ఉపాధ్యక్షుడు,నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక తెలంగాణ 5వ రాష్ట్ర వార్షిక సమావేశం (ప్లీనరీ) అచ్చంపేట పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక యువతరంలో మూఢనమ్మకాలను నిర్మించడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో ఇటువంటి వేదికల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో పాటు మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు,అచ్చంపేట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడుపాల గోపాల్ రెడ్డి, నాయకులు, జన విజ్ఞాన వేదిక నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా జనవిజ్ఞాన వేదిక జ్ఞాపికల అందజేత

## పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్**



రైతులకు మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కోయిలకొండ ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధి. కారి డాక్టర్ నరేష్ రైతులకు సూచించారు. శనివారం కోయిలకొండ మండలం దమాయపల్లి గ్రామపంచాయతీలో నీ జయనగర్ తాండలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మహేశ్వరి రవికుమార్ ప్రారంభించారు. కృత్రిమ గర్భధారణ చేసిన పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. పశువైద్య శిబిరానికి వచ్చిన ఆవులకు, గేదెలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. దూడలకు నట్టల మందులను తాపించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్. అభంగపట్నం లైవ్ స్టాక్ అధికారి జయ ప్రద మాట్లాడుతూ మండలంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరాలకు వచ్చిన పశువులకు ఉచిత మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు నాయక్ , వార్డు సభ్యులు జోగు బాలయ్య, రమేష్ నాయక్, గోపాలమిత్ర సూపర్వైజర్ విజయ్ కుమార్, పశు వైద్య సిబ్బంది సతీష్, గోపాల మిత్రులు రామకృష్ణ, వెంకోజీ, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాగు భూములన్నిటికి రైతు భరోసా ఇవ్వాలి

**నారాయణపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్ అనకుండా సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అయిన రైతు భరోసా డబ్బులను వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా, కూలీలు రోషన్ బీ, చిన్న కిష్టమ్మ, శశికళ, ఎల్లమ్మ, నిర్మల తదితరులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15,000 ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం రూ.12,000 మాత్రమే ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు రూ.3,000 తగ్గించి మోసం చేసినట్లే ఇప్పుడు యాసంగి పంటలు వేసిన వారికి శాటిలైట్ ఆధారంగా మాత్రమే రైతు భరోసా ఇస్తామని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి భూమికి సమానంగా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఇప్పటికే రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆలస్యం చేయకుండా వెంటనే రైతుల ఖాతాల్లో పూర్తి మొత్తాన్ని జమ చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ చైర్మన్ ఎంపికపై కసరత్తు



**ఆత్మకూర్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త ;** మక్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూర్ మున్సిపల్ చైర్మన్ ఎంపికపై కాంగ్రెస్ పార్టీ కసారపు చేస్తున్నట్లుగా తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రోజు వెలువడిన ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో అధికార కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వచ్చినప్పటికీ మున్సిపాలిటీ చైర్మన్ ఎంపికపై రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు మొత్తం నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆచితూచి నిర్ణయం తీసుకోనున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పట్టణంలోని మున్సిపల్ 10 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరు వార్డులను గెలుచుకొని సత్తా చాటగా ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ మాత్రం ఒకే ఒక్క స్థానానికి పరిమితం కావడం బిజెపి సైతం తానూరంగంలో ఉన్నానంటూ మూడు వార్డులను దక్కించుకొని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానాన్ని దక్కించుకునేందుకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉండగా మండలంలో ఆ నలుగురిగా పేరొందిన ప్రముఖుల్లో ఒకరు ఇప్పటికే ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో ఆత్మకూర్ పట్టణంలోని రెండవ వార్డు నుండి విజయం సాధించిన నల్లగొండ శ్రీనివాసులు రిజర్వేషన్ ఆధారంగా చైర్మన్ స్థానానికి అనాహుడిగా మిగిలిపోయారు. ఈ తరుణంలో తాను సూచించిన వ్యక్తికి ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలంటూ రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి వద్ద సూచించినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రహమతుల్లా పట్టణంలోని పదవ వార్డు నుండి తల్లి సుబేదా బేగంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్న నేపథ్యంలో తమకే మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలంటూ మంత్రివర్యుల వద్ద ప్రధాన డిమాండ్ గా ఉంచినట్లుగా తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వచ్చినప్పటికీ ఆత్మకూర్ మున్సిపల్ చైర్మన్ ఎంపిక మొదట్లో ప్రకటించకపోవడం పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందని విషయాన్ని ముందుగానే మంత్రి దృష్టికి తెచ్చినట్లుగా ఆత్మకూర్ పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాతవార్తకు వివరించారు. ఇరువురి మధ్య సఖ్యత కుదరని నేపథ్యంలో పట్టణంలోని ఏడవ వార్డు నుండి విజయం సాధించిన నాగమణి లేదా తొమ్మిదవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన సద్దల తులసి వెంకటరాములకు సైతం మార్కెట్ కమిటీ చైర్మన్ వరించి అవకాశాలు ఉన్నాయంటూ పార్టీకి చెందిన పలువురు నాయకులు పట్టణంలో చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, చైర్మన్ పదవిపై కోటి ఆశలు పెట్టుకున్న నల్లగొండ శ్రీనివాసులకు ఇరువురి మధ్య సఖ్యత గురించి రాష్ట్ర మంత్రివర్యులు మున్సిపల్ చైర్మన్ ఎంపిక పూర్తి చేస్తారని విశ్వాసం తమకుందంటూ పలువురు ప్రభాతవార్తతో పేర్కొన్నారు.

## నేడు శివాలయంలో మహా శివరాత్రి వేడుకలు



శ్రీ మార్కండేయ ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని నేడు అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు వనం పర్వతాలు తెలిపారు. శనివారం ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. పార్వతీ పరమేశ్వరులను కళ్యాణానికి అలంకరించి సిద్ధం చేశారు. మంగళ స్నానాలు చేయించారు, లోక కళ్యాణార్థం రుద్ర హోమం నిర్వహించారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలందరూ గాజుల తో అలంకరించుకొని గోరింటాకు కార్యక్రమాన్ని చేపట్టారు, నేడు సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా భజనలు, కోలాటాల తో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని, నేడు రాత్రి 12 గంటలకు పార్వతి పరమేశ్వరుల దివ్య శాంతి కళ్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరుడు (పరమేశ్వరుడు)తరపున కోట ప్రశాంతి, కిషోర్ దంపతులు, వధువు (పార్వతి దేవి) తరపున కర్ణాటక నిర్మల, నారాయణ దంపతులు కళ్యాణ్ లో కూర్చొని కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వనం పర్వతాలు, చిలువేరు ధనరాజ్, కర్నాటి రాములు , కర్నాటి నారాయణ, వనం వేణు, గుజ్జరి నరసింహ, గంజి జగదీష్, ఇమ్మడి రమేష్, కర్నాటి నవీన్, మాకం శేఖర్, శకుంతల,గీత లు పాల్గొన్నారు.

## మలిశెట్టి వెంకటేష్‌కు గౌరవ డాక్టరేట్ బిరుదు

**- సామాజిక సేవకు కొత్తమొల్గర సర్పంచికి అరుదైన గౌరవం, - చెన్నయ్‌లో డాక్టర్ పట్టా పొందిన వెంకటేష్**



పట్టాను అందుకుంటున్న కొత్తమొల్గర సర్పంచి మలిశెట్టి వెంకటేష్

**భూత్పూర్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తమొల్గర సర్పంచి,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మలిశెట్టి వెంకటేష్‌కు గౌరవ డాక్టరేట్ బిరుదు లభించింది.సామాజిక సేవ,మంచితనం ,నిగర్వి,నిరాడంబరత,రాజకీయ సేవాతత్పరత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న గ్లోబల్ హుమన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అమెరికా సంస్థ ఆహ్వానం మేరకు కొత్తమొల్గర సర్పంచి మలిశెట్టి వెంకటేష్ శనివారం మధ్యాహ్నం ఆ సంస్థ ప్రతినితుల చేతుల మీదుగా చెన్నయ్‌లో ఏర్పాటు చేసిన డాక్టరేట్ బిరుదుల ప్రదానోత్సవంలో పాల్గొని వారిచే డాక్టరేట్ బిరుదు,పట్టాను పొందారు.ఉత్తమ విలువలు కల్గిన తమ నాయకుడు గౌరవ డాక్టరేట్ బిరుదు,అవార్డును పొందడం పట్ల ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మాజీ ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరి యా నాయక్,మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు,కాంగ్రెస్ నాయకుడు,జిల్లా వడ్డెర సంఘం నాయకుడు కప్పెట శ్రీనివాసులు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డి,పల్లె రాంరెడ్డిలతో పాటు తోటి సర్పంచులు మాసగౌడ్(కప్పెట), రమేష్(వెల్కిచర్ల),తారు నాయక్(భట్టుపల్లి ఏవీఆర్ కాలనీ),సభావత్ జైపాల్)ఉప సర్పంచి-భట్టుపల్ల ఏవీఆర్‌కాలనీ),లక్ష్మమ్మ-రఘుపతి రెడ్డి(భట్టుపల్లి),ఆనంద్‌రెడ్డి(పోతులమడుగు), సంజీవరెడ్డి(హస్నాపూర్) తదితరులు గౌరవ డాక్టరేట్ పొందిన కొత్తమొల్గర సర్పంచి మలిశెట్టి వెంకటేష్‌ను అభినందిస్తూ,శుభాకాంక్షలు తెలిపారు.

### భూత్పూర్ మున్సిపాలిటీలో

## సింగిల్ డిజిట్లకే పరిమితమైన స్వతంత్రులు

**భూత్పూర్,ఫిబ్రవరి 14.ప్రభాతవార్త :** ఒకటి,మూడు,నాలుగు,ఆరు,ఏడు ఇవేవి అంకెలగారెడి అనుకుంటే పొరపాటే.భూత్పూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు పడిన ఓట్లు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీచేసే హక్కు ప్రతిభారతీయుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు.అయితే ఎంతో ఆశయంతో,ప్రజలకు మేలు చేయాలి,ప్రజా సేవ చేయాలన్న తపనతో ఎన్నికల్లో పోటీచేసి ఎన్నికల బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థుల పరిస్థితి భూత్పూర్ మున్సిపాలిటీలో చాలా దయనీయంగా మారింది.అధికార,ప్రతిపక్షాలతో ధీటుగా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులకు ఏ ఒక్కరికీ డబుల్ డిజిట్ ఓట్లు పడకపోవడం కడుశోచనీయం.ఈ నెల 11న జరిగిన భూత్పూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే ఎస్టీ మహిళ రిజర్వేషన్‌కు కేటాయించిన తొమ్మిదోవార్డు భూత్పూర్-బీసీ కాలనీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సభావత్ శిరీషకు ఒకే ఒక ఓటు వచ్చింది.అయితే ఈ ఒక్క ఓటు కూడా ఆమెదేనని భావిస్తున్నారు.ఇదేవార్డు నుంచి పోటీ చేసిన మరో స్వతంత్ర అభ్యర్థి పాత్లావత్ మణెమ్మకు కేవలం నాలుగు ఓట్లు వచ్చాయి.ఎస్సీ జనరల్‌కు కేటాయించిన భూతూర్ నాల్గోవార్డు ఎస్సీ కాలనీ,ఇందిరానగర్‌కాలనీ నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి బజారు నర్సింహులుకు మూడు ఓట్లు, ఎస్టీ మహిళకు కేటాయించిన ఒకటోవార్డు రాందాస్‌తండా-సిద్దయ్యపల్లి నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి సుజాతకు ఆరు ఓట్లు,జనరల్‌కు కేటాయించినఎనిమిదోవార్డు అమిస్తాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మల్లిఖార్జున్‌కు కేవలం ఏడు ఓట్లు మాత్రమే పోలయ్యాయి.భూత్పూర్ మున్సిపాలిటీలోని పదివార్డులలో మొత్తం తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండగా,వీరిలో ఐదుగురు అభ్యర్థులు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడి రెబల్‌గా ఎస్టీ మహిళకు కేటాయించిన ఒకటో వార్డు నుంచి పోటీ చేసిన సభావత్ సౌజన్య కాంగ్రెస్ అభ్యర్థి ముడావత్ మాధురికి ధీటుగా గట్టి పోటీనిచ్చారు.సౌజన్య 467ఓట్లు సాధించి అందరిచే సెహబాష్ అనిపించుకున్నారు.ఇక్కడి నుంచి గెలిచిన ముడావత్ మాధురికి 514ఓట్లు వచ్చాయి.కొద్దిపాటి అంటే 47ఓట్లతో ఇండిపెండెంట్ అభ్యర్థి సభావత్ సౌజన్యపై ముడావత్ మాధురి విజయం సాధించారు.ఎస్సీ జనరల్‌కు కేటాయించి ఇక మూడో వార్డు గోప్లాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థి కె ముత్తయ్యకు 116ఓట్లు,జనరల్ మహిళకు కేటాయించిన రెండోవార్డు నర్సింగాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డెగావత్ శాంతికి 57ఓట్లు వచ్చాయి.ఇక బీసీ మహిళకు కేటాయించిన పదోవార్డు ఓల్డ్ భూత్పూర్ ఏరియా నుంచి పోటీ చేసిన నాహిద్ బేగంకు కేవలం పది ఓట్లు మాత్రమే వచ్చాయి.

## తపోవన్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

**పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి**



తపోవన్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

**దేవరకద్ర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని డోకూర్ సమీపంలో గల తపోవన్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబ్‌నగర్ మేనేజ్మెంట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, తపోవన్ ప్రిన్సిపాల్ వర్కుట్టి నిరంజన్ రెడ్డి, జ్యోతి ప్రజ్వలనం చేసి, వేడుకలను ప్రారంభించారు. చిన్నారులు, విద్యార్థులు, ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ అంశాలపై రూపొందించిన నృత్యాలు, దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు, కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, అతిథులు, హర్షతీరేఖాలతో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ప్రతిభా కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, మంచి విజయాలు సాధించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతి రంగాల్లో కూడా రాణించాలని ముఖ్య అతిథులు విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్షిక నివేదికను సమర్పించి, విద్య ఫలితాలు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యల హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ లక్ష్మీకాంత్ రెడ్డి, ట్రాస్మా స్టేట్స్ సెక్రటరీ కొండా శ్రీనివాస్ రెడ్డి,దేవరకద్ర పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుట్టి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రయ్య, నరసింహులు, రవి, శ్రీనివాసులు, ఇగ్బాల్ పాషా, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమా, సబిహ, పావని, సరిత, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, శ్రావణి, సరిత, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

## వడ్వాట్ శివాలయ జాతర ప్రారంభం

**సర్పంచ్ గుంటగారి రవీందర్**

**మాగనూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వడ్వాట్ గ్రామ శివాలయ జాతర మహోత్సవం నేటి నుండి ప్రారంభం కానున్నట్లు గ్రామ సర్పంచ్ గుంటగారి రవీందర్ తెలిపారు. ఆదివారం ప్రభోత్సవము, సోమవారం రథోత్సవం, మంగళవారం పాలఉట్లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి పరిసర ప్రాంత ప్రజలు పెద్ద మొత్తంలో హాజరై పరమశివుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

## కౌన్సిలర్ ప్రేమ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**భూత్పూర్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన భూత్పూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో నాల్గోవార్డు నుంచి కౌన్సిలంగా గెలుపొందిన గడ్డం ప్రేమ్‌కుమార్‌ను పలువురు మాజీ ఎమ్మెల్యే ఆలతో పాటు బీఆర్ఎస్ నాయకులు మొహ్మద్ సాధిక్,మొహ్మద్ షాకీర్,సత్తూర్ సురేష్‌గౌడ్,సత్తూర్ రాకేష్‌గౌడ్,సత్తూర్ తిరుపతయ్యగౌడ్‌లు అభినందనలు తెల్పి ఘనంగా సన్మానించారు.విజయం సాధించిన గడ్డం ప్రేమ్‌కుమార్‌తో కలిసి పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

## నాగిరెడ్డిపల్లిలో శ్రీ సిద్దేశ్వర స్వామి జాతర

**మూడు రోజులపాటు మహాశివరాత్రి వేడుకలు**

**మద్దూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ సిద్దేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ఆదివారం 15 తేదీ నుంచి 17 తేదీ వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుడు గొల్ల రాములు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి.15వ తేదీఉదయం గణపతిహోమం,రుద్రహోమం,108కలశ పూజలు,అన్నాభిషేకం నిర్వహించబడును.అనంతరం పల్లకిసేవ ఊరేగింపు జరుగును.రాత్రి మహాశివరాత్రి జాగరణ,అఖండ భజన,శివపార్వతుల కళ్యాణం నిర్వహించబడును.16వ తేదీ సోమవారం జాతర ప్రధానకార్యక్రమాలు, అన్నదానం, సాయంత్రం భజనలు జరుగును. 17వ తేదీ మంగళవారం ముగింపు వేడుకలు నిర్వహించబడును.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

## క్రికెట్ పోటీలకు టీ-షర్టులు అందజేత



టీ-షర్టులు అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** కల్వకుర్తిలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ క్రికెట్ పోటీలో పాల్గొంటున్న వెల్దండ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు వెల్దండ రిక్రియేషన్ క్లబ్ తరపున అధ్యక్షులు యన్నం శ్రీనివాస్ రెడ్డి టీ-షర్టులను అందజేశారు. అదేవిధంగా క్లాస్మేట్ క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రెటరీ శివకుమార్, ఉపాధ్యక్షులు రమేష్,సంజీవ్ యాదవ్, విజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## స్వతంత్ర అభ్యర్థి బిజెపిలో చేరిక



బిజెపిలో చేరిన స్వతంత్ర అభ్యర్థి

**నారాయణపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బి. జయశ్రీ భారతీయ జనతా పార్టీ లో చేరారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె.రామచంద్రరావు సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో జయశ్రీ రెబల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 10వ వార్డులో మొత్తం 1256 మంది ఓటర్లు ఉండగా, అందులో 1023 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి అనుషకు 160 ఓట్లు, బీజేపీ అభ్యర్థి సిద్ధి విజయలక్ష్మికి 386 ఓట్లు, టీఆర్ఎస్ అభ్యర్థి సుజాతకు 12 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థి జయశ్రీకి 451 ఓట్లు రావడంతో ఆమె విజయం సాధించారు. జయశ్రీ బీజేపీలో చేరడంతో నారాయణపేట మున్సిపాలిటీలో బీజేపీ కౌన్సిలర్ల సంఖ్య 12కు చేరింది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జయశ్రీ తెలిపారు.

# సమాన పనికి సమాన వేతనం

● తెలంగాణ మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్



దుర్గం శ్రీనివాస్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

**వనపర్తి రూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలంగాణ మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర పర్యటనలో భాగంగా శనివారం వనపర్తి జిల్లాకు వచ్చిన వారికి జిల్లా అధ్యక్షులు వాకిటి రమేష్ అధ్యక్షతన వనపర్తి జిల్లా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ విధానం రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సిలో స్లాబ్ సిస్టమ్ తొలగించి, క్యాడర్ బేసిక్ వేతనాలు ఇవ్వాలని, ప్రతీ సంవత్సరం 10 శాతం ఇంక్రిమెంట్ అమలు చేయాలని అన్నారు. ప్రధానంగా వేతనాల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు నెల నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వ జీవోను అమలుచేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా కొత్తగా ప్రతిపాదించిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా చికిత్స అందించాలని ఆయన అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్‌ల మాదిరిగా మెడికల్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ వెయిటేజ్ మార్కులు కల్పించాలని డిమాండ్. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిసిబ్బంది, మెడికల్ కాలేజ్ సిబ్బంది, నర్సింగ్ కళాశాల సిబ్బంది ,మాతా శిశు సంక్షేమశాఖ సిబ్బంది, పేషెంట్ కేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల కల్యాణోత్సవం

**వెల్దండ, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రం లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం 34వ వార్షికో త్సవ సందర్భంగా స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఉదయం పతాకవిష్కరణ, ప్రత్యేక అభిషేకాలు పూజలు, స్వామివారి పల్లకి సేవ ఊరేగింపు అనంతరం ఉదయం 11 గంటలకు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కళ్యాణోత్సవం నిర్వ హిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కళ్యాణోత్సవ వేడుకలను గ్రామ సర్పంచ్ మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుంద న్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హజరువుతన్నారని, బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో శనివారం నాలుగో వార్డ్ మెంబర్ కేశపాగ ఆంజనేయులు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ వినీల రాణి కురుమయ్య చేతుల మీదుగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన 2.0 ఉచిత గ్యాస్ సిలిండర్లను అర్హులైన లబ్దిదారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ జూడం అనిత శివకుమార్, చింతల భాస్కర్ యాదవ్, కుమ్మరి చంద్రశేఖర్, బీసమ్మగారి అశోక్, జమ్మన్నగారి ఎల్లస్వామి పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ సర్పంచ్ మద్దిలేటి యాదవుకు సన్మానం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ గ్రామ సర్పంచ్ మద్దిలేటి యాదవును శనివారం వారి స్వగృహంలో సీనియర్ జర్నలిస్టు కొంతం ప్రశాంత్ శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. కొంతం ప్రశాంత్ మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు శ్రీరంగాపూర్ గ్రామ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. మీపై నమ్మకం పెట్టి గెలిపించిన ప్రజలకు నిరంతరం ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. మద్దిలేటి యాదవ్ తన సొంత పనిలాగే ఇతరుల పనిని అధికారం లేకున్న నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ సేవ చేస్తున్నందుకే ఈ గెలుపు సాధ్యమైందని ఆయన గుర్తు చేశారు. భారీ మెజార్టీతో గెలిపించినటువంటి శ్రీరంగాపూర్ ప్రజలకు ఎంతో రుణపడి ఉండాల్సిన బాధ్యత మద్దిలేటి యాదవ్‌పై ఉందనిఈ సందర్భంగా తెలియజేశారు. శ్రీరంగాపూర్ గ్రామ ప్రజలు చాలా చైతన్యవంతులు బడుగు బలహీనవర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర శ్రీరంగాపూర్ గ్రామంనకు ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మద్దిలేటి యాదవ్ వంటి వ్యక్తి దొరకడం ఎంతో అదృష్టమని ఈ సందర్భంగా కొనియాడారు. సర్పంచ్ మద్దిలేటి యాదవ్ మాట్లాడుతూ తనను సన్మానించిన కొంత ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ తన కర్తవ్యాన్ని బాధ్యతతో వ్యవహరిస్తూ శ్రీరంగాపురాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామచంద్ర యాదవ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## సీఎం కప్ ఆటల పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

**ఖిల్లాఘనపురం ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** జిల్లా స్థాయిలో శుక్రవారంనిర్వహించిన సీఎం కప్పు ఆటల పోటీలలో మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామా నికి చెందిన కే ఉదయ్‌కిరణ్ లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించారని, అప్పారెడ్డిపల్లి గ్రామాన్ని చెందిన సాయి సాత్విక్ 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి ఉదయ్ కుమార్‌రెడ్డి జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ తెలిపారు. వీరిద్దరూ గతంలో పలు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొని పథకాలు సాధించారని అభినందించారు. ఇద్దరికీ తమ చేతిలో మెడల్స్‌ను ప్రధానం చేశారు.

## ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

● జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా వివిధ డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇన్చార్జిలుగా బాధ్యతలు స్వీకరించి అహర్నిశలు కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే ధృడసంకల్పంతో మీరుచూపిన కృషి, సమన్వయం, సేవాభావం అభినందనీయమన్నారు. ఈ ఎన్నికల్లో మీరు అందించిన సహకారం పార్టీ బలపాటుకు, ప్రజలతో మరింత దగ్గర కావడానికి ఎంతో దోహదపడిందన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**జడ్చర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** జడ్చర్ల క్లాసుమేట్ క్లబ్ ఆధ్వర్యంలో యూట్యూబ్ ఫౌండేషన్ డే సందర్భంగా కొరంపేట్ సంస్కార్ స్కూల్లో శనివారం పిల్లలకు యూట్యూబ్ గురించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మంది విద్యార్థులకు బాలుసాని ఉపేందర్ సహకారంతో మొదటి, రెండో బహుమతి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్చర్ల క్లాస్ మేట్ క్లబ్ అధ్యక్షులు ఆలంపల్లి ప్రదీప్, ప్రిన్సిపాల్ శిల్పా, కరస్పాండెడ్ సందీప్, డైరెక్టర్స్ రాధిక, తేజశ్రీ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహారాజ్ బోధనలు మార్గదర్శకం

ఆయన స్ఫూర్తి యువతకు ఆదర్శం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** సద్గురు సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని వారి ఆధ్యాత్మిక స్ఫూర్తి యువతకు ఆదర్శం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న శోభా యాత్రకు సంబంధించిన గోడ పత్రికను ఆయన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు రఘునాయక్, చత్రపతి నాయక్, వెంకీ, రాజేష్ నాయక్, రవీందర్ నాయక్, మహేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డిగూడెంలో భక్తిశ్రద్ధలతో జ్యోతిర్ముడి

**రాజాపూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలంలోని రంగారెడ్డిగూడెం భక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా జ్యోతిర్ముడిద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ, శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనంపల్లి అనిరుద్ రెడ్డి శాసనసభ్యులు మాతృమూర్తి శశికళ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ రేవతిఆనంద్, సింగమ్మగూడ సర్పంచ్ రాఘవేందర్, సన్నిధానం గురుస్వామి నర్సింలు, శ్రీను, కుమార్, శివస్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కృష్ణయ్య గురుస్వామి ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ప్రజలు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాకు, జోన్‌కు పేరు ప్రఖ్యాతలు తేవాలి

17 నుంచి హైదరాబాదులో పోలీస్ స్పోర్ట్స్
క్రీడాస్ఫూర్తిని కనబరచాలని
క్రీడాకారులకు ట్రాక్ సూట్,
షూస్ పంపిణీ చేసిన ఎస్పీ డి. జానకి



క్రీడాకారులకు ట్రాక్ సూట్, షూస్ పంపిణీ చేస్తున్న ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో పాల్గొనబోయే మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు మహబూబ్‌నగర్ జిల్లా, జోగులాంబ జోన్‌కు మంచిపేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆకాంక్షించారు. ఫిబ్రవరి17 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా పోలీస్ శాఖలోని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనశక్తి, నాయకత్వ లక్షణాలను ప్రతిబింబించే వేదిక అని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఎస్పీ స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు స్పోర్ట్స్ షూస్ అందజేశారు. క్రీడాకారులు సరైన సాధనతో, పూర్తి నిబద్ధతతో పోటీల్లో పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి వేదికపై పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన వ్యక్తిగత ప్రతిభతో పాటు జిల్లా జోన్ ప్రతిష్ఠను ప్రతిబింబిస్తాడని స్పష్టం చేశారు. గెలుపు లక్ష్యంగా కఠిన సాధన చేయాలని, నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం విజయానికి మూలాధారాలని పేర్కొన్నారు. మైదానంలో చూపే ప్రతీ ప్రదర్శన పోలీస్ శాఖ ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంటూ, క్రీడాస్ఫూర్తితో, సంపూర్ణనిబద్ధతతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు అడ్మిన్ కృష్ణయ్య, నగేశ్, ఆర్ఎస్ఐ సత్యం క్రీడాకారులు పాల్గొన్నారు.

# పేటలో రాజకీయ సమరం ముగిసింది

- చైర్మన్ ఎవరనేది ఉత్కంఠ



గెలుపొందిన బిజెపి మహిళ అభ్యర్థులు

**నారాయణపేట, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలో జరిగిన పురపాలక ఎన్నికల సమరం విజయవంతంగా ముగిసింది. మొత్తం 24 వార్డులకు గాను ఫలితాలు వెలువడగా బీజేపీ 12 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 8 వార్డుల్లో విజయం సాధించింది. ఎంఐఎం 2 స్థానాలు దక్కించుకోగా, టీఆర్ఎస్ 2 వార్డుల్లో గెలుపొందింది. ఈ సంఖ్యల నేపథ్యంలో చైర్మన్ పదవి కోసం అవసరమైన మెజార్టీపై ఉత్కంఠ నెలకొంది. టీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఎవరికి మద్దతు ఇస్తారన్నది కీలకంగా మారింది. వారి నిర్ణయం చైర్మన్ ఎన్నికలో ప్రధాన పాత్ర పోషించే అవకాశముంది. దీంతో పట్టణ ప్రజల్లో చైర్మన్ ఎవరు?" అన్న చర్చ జోరందుకుంది. ఇదిలా ఉండగా, బీజేపీ నుంచి చైర్మన్ రెసులో శ్వేతా సత్య యాదవ్, మంజుల జీఆర్ రెడ్డి, శ్వేత రఘు రామయ్య గౌడ్ ఉన్నారు. ప్రజలు మాత్రం ఎన్నికల వేళ జరిగిన రాజకీయ పోటీలు, పరస్పర విమర్శలు ఇప్పుడు పక్కనపెట్టి పట్టణ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా, స్వతంత్రులైనా, వచ్చే ఐదేళ్లలో వార్డుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఉండాలనిపట్టణ వాసులు కోరుతున్నారు. అధికార పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే ప్రతిపక్షాలు కూడా సహకరించి ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రజా తీర్పును గౌరవిస్తాం

● రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మక్తల్ మున్సిపాలిటీని కేంద్రం నిధులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓ వర్గం వారు గంప గుత్తగా ఓటు వేయడం వల్లనే కాంగ్రెస్ కు మెజారిటీ వచ్చిందని మున్సిపాలిటీ ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య అన్నారు. ఈ తీర్పు రాబోయే జడ్పిటిసి, ఎంపిటిసి, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు పార్టీ మెరుగుపడటానికి వీలవుతుందని ఓడిపోయిన అభ్యర్థులకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. శనివారం బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి ఇంట్లోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న నిధులమేరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్పెషల్ గ్రాంట్లతోనే అభివృద్ధి చేశామని, ఎన్నికల్లో ఇంతకన్నా మెరుగైన అభివృద్ధి చేస్తామని చెప్పినా మంత్రి మాటలకు ప్రజలు నమ్మి మున్సిపల్ చైర్మన్ పదవికి సంపూర్ణ మెజార్టీ ఇచ్చారని వారు ఇచ్చిన హామీలను నెరవేర్చవలసిన బాధ్యత మంత్రిపై ఉందన్నారు. వీధి వీధిలో సిసి రోడ్లు త్రాగునీరు వసతి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని హామీలుఇచ్చారని పునాదులకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ స్కూలు, ఇంకా పూర్తికాని ఆసుపత్రి పదేపదే చేశానని చెప్పడం ప్రజలు విశ్వసించారనివాటిని పూర్తిచేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బలరాం రెడ్డి, కల్లూరునాగప్ప, దేవరెంటినరసింహారెడ్డి, కావలి వెంకటేష్ కౌన్సిలర్లు పీకేనరసింహ, టప్పకృష్ణ ప్రధాన కార్యదర్శి కురువలింగం, టప్పనరేందర్, బ్యాటరీ రాజు, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా

- సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్



రైతులకు మందులను అందజేస్తున్న సర్పంచ్

**ఊర్కొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతు కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉండి పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తానని సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జకినాలపల్లి గ్రామంలో పాడి రైతులఆరోగ్య పరిరక్షణకు, వాటికి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఎంజీ గ్రామ శక్తి సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఊర్కొండ మండల పశువైద్యులు డాక్టర్ రాజేష్ కుమార్ హజరై గ్రామంలోని పశువులకు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి వాటికి కావాల్సిన మందులను అందించినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పాడి రైతులు అధిక సంఖ్యలో ఈ శిబిరానికి తరలివచ్చి సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు. రైతు కుటుంబాలకు రానున్న రోజుల్లో కూడా అన్ని విధాలాఅండగా ఉంటామని, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ పశువులకు సోకే వివిధ వ్యాధుల నివారణకు టీకాలు వేయడంతో పాటు, అంతర్గత పరాన్నజీవుల నిర్మూలనకు నట్టల మందును పంపిణీ చేసినట్లు తెలిపారు. పశుపోషణలో రైతులుతీసుకోవాల్సిన శాస్త్రీయ జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పోలే రాజశేఖర్, వార్డు సభ్యులు, గ్రామ పాడి రైతులు పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వ హయాంలో..

# నల్లమలకు వన్నె తెచ్చిన క్రీడలు

● అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ
● ముగిసిన సివికె కప్ ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్
● విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న మెరుగు రమేష్ రెడ్డి టీం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** నల్లమల ప్రాంతం క్రీడలో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం లక్ష్యం అని, అచ్చంపేట క్రీడలకు అధిక ప్రాధాన్యత అందిస్తున్న ప్రజా ప్రభుత్వమని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలో రాజీవ్ ఎన్టీఆర్ స్టేడియంలో గత వారం రోజుల నుంచి విజయవంతంగాఅనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అండపల్లి జలంధర్ రెడ్డి ప్రోత్సాహంతో ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. ముగింపు రోజున శనివారం ఫైనల్ మ్యాచ్ వీక్షించి మొదటి బహుమతి పొందిన మెరుగు రమేష్‌రెడ్డి టీం ప్రథమ బహుమతి రూ.5 లక్షలు నగదు ప్రోత్సాహం అందుకోగా, ద్వితీయ బహుమతి బళ్లారి రూ.3 లక్షల రూపాయలు ప్రైజ్ మనీ షీల్డ్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లమల్ల ప్రాంతంలో క్రీడలకు ఎక్కువ ప్రాధమికస్తూ ఎంతోమంది క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం అన్నారు. అచ్చంపేటలో సీజన్ మూడవ ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగింది. క్రీడలు విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నిర్వాహకులు, మేనేజ్మెంట్ వారి ఆధ్వర్యంలో క్రీడలు విజయవంతంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు అనూష కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు అధినేత అండపల్లి జలంధర్‌రెడ్డి, సోదరుడు రామకృష్ణారెడ్డి, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, దర్గా కమిటీ చైర్మన్ రఫీ, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ భీరం మాధవ రెడ్డి, మాజీఎంపీపీ రామనాథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడుపాల గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నిర్వాహకులు కపిలవాయి చంద్ర మోహన్, కటకం రఘురాం, ఆకుల లావణ్య వెంకటేష్, సాదిక్, ప్రధీప్ పటేల్, వంశీ, రమేష్, మేరజ్ పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



**మాగనూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మాగనూర్ మండలంలోని అమ్మపల్లి గ్రామంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా గ్రామ సర్పంచ్ నరసింహులు కబడ్డీ టోర్నమెంట్ ను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్లో పరిసర ప్రాంతాల యువకులు పోటీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా అవసరమని అన్నారు. ఆటలు శరీరానికి ఔషధం లాగా పనిచేస్తాయని యువకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలరాం, కాంగ్రెస్ యువనాయకులు కృష్ణ, అయ్యప్ప, తమన్నాతో పాటు గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు ఇచ్చారు..

# ప్రగతికి చోటిచ్చారు

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ప్రజల హృదయంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు ఇచ్చి, ప్రగతికి చోటు కల్పించారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో జరిగిన భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయాన్నిఅందించిన మూడు మున్సిపాలిటీల ప్రజానీకానికి మరియు పార్టీ నాయకులకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈమున్సిపల్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీనిగెలిపించినప్రజానీకానికి మరొకసారి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలి

◆ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి
◆ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



వైద్య సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్యం పట్ల నివేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. శనివారం అచ్చంపేట పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి ఏరియా తిరిగారు. వైద్య సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న వైద్యం పట్ల ఆరా తీశారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల పట్లఅడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, వైద్యులు ఉన్నారు.

## మహాశివరాత్రి రోజు స్పర్శ లింగ దర్శనం

**మాగనూర్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేక స్పర్శ లింగ దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, పూజారి ప్రవీణ్ స్వామి తెలిపారు. మాగనూర్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర ఆలయంలో భక్తులకు ఆదివారం 11:30 నిమిషాల వరకు భక్తులకు ప్రత్యేక స్పర్శలింగ దర్శనం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమశివుని ఆశీస్సులతోపాటు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పేటలో అత్యధిక మెజార్టీతో గెలిచిన శ్వేత వెంకటేష్ గౌడ్

**నారాయణపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని 20వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి శ్వేతా వెంకటేష్ గౌడ్ ఘన విజయం సాధించారు. ఆమెకు మొత్తం 730 ఓట్లు పోలయ్యాయి. సమీప అభ్యర్థిపై 562 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందడం విశేషంగా నిలిచింది. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 24 వార్డులలో ఇదే అత్యధిక మెజార్టీ కావడం ప్రత్యేకత ఈ సందర్భంగా శ్వేతా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన 20వ వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తరపున ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, వార్డు అభివృద్ధి దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పథకాలన్నీ వార్డు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటానని ఆమె వెల్లడించారు.

## రక్తదానం శిబిరం విజయవంతం

**జడ్చర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణ మాజీ రజక సంఘం అధ్యక్షుడు, మాజీ వార్డు మెంబర్ నడిమింటి రమేష్(రవి) తృతీయ వర్ధంతి సందర్భంగా జడ్చర్ల పట్టణం 10 వ వార్డులో ఆయన అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గవర్నమెంట్ జనరల్ దవాకన మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 35మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ రక్తదానం మహాదానం అని ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ లక్ష్మి మరవీందర్, కౌన్సిలర్లు ప్రశాంత్, శశికిరణ్, నాయకులు ప్రనిల్ చందర్, మురళి, ఇమ్ము, బుక్కవెంకటేష్, జడ్చర్ల పట్టణ రజక సంఘం అధ్యక్షుడు బి. శివకుమార్, గౌర అధ్యక్షుడు నడిమింటి లక్ష్మయ్య, శ్రీను, మెడికల్ ఆఫీసర్ డా. రజిత, క్యాంప్ ఆర్గనైజర్ మధుసూదన్ రెడ్డి, స్టాఫ్ నర్స్ ఓంకార్ ల్యాబ్ టెక్నీషియన్ నజియా బేగం, వైద్య సిబ్బంది, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దేశ రక్షణ కోసం ఆత్మత్యాగానికి సిద్ధంగా ఉండాలి

పుల్వామా ఉగ్ర దాడిలో అమరులకు కొవ్వొత్తులతో ఘన నివాళి

**నారాయణపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన భారత ఆర్మీ జవాన్లకు ఘన నివాళి అర్పిస్తూ శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోడుగు గేరి హనుమాన్ మందిరం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు భారత్ మాతా కి జై", జోహార్ ఆర్మీ జవాన్లకు" అంటూ నినాదాలు చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు వక్తలు మాట్లాడుతూ దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులను తట్టుకుని నిలబడే సామర్థ్యం భారత సైన్యానికి ఉందని పేర్కొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం అందరూ కలిసి పనిచేయాలని, యువత దేశభక్తి భావనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అమరుల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు భీమ్‌చందర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, మ్యాడమ్ ప్రభాకర్, రామచందర్, చంద్రకాంత్, కదుదాస్ ప్రవీణ్, శ్రవణ్, సచిన్, నరేష్, చరణ్ రెడ్డి, అనంత్‌రెడ్డి, చంద్రశేఖర్, చంద్రకాంత్ యాదవ్, ఆశిష్, అశ్విన్, ఆకాష్, చక్రి, అరవింద్, శివాజీ రవి, రాజశేఖర్, అనిల్ రెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

